**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ 10.01.2026** **సమయం. 18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. రాష్ట్రాన్ని గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.
2. సంక్రాంతి పండుగ నేపథ్యంలో అదనపు రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే విస్తృత ఏర్పాట్లు చేసింది.
3. సంక్రాంతి పండుగ సందర్భంగా రోడ్డు మార్గంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు.
4. రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.

...................................................................

**గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్:**

రాష్ట్రాన్ని గ్లోబల్ 'ఇన్నోవేషన్ క్యాపిటల్'గా తీర్చిదిద్దటమే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. టెక్నాలజీ కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, దేశ సేవకు, ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలన్నారు. బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్‌లో ఈ రోజు నిర్వహించిన 'బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ గ్లోబల్ మీట్' లో ఆయన మాట్లాడుతూ... ఇతర దేశాలు ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తే, భారత్ మాత్రం

ఆధార్, యూపీఐ లాంటి 'డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' తో ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఏఐ ఆధారిత 'తెలంగాణ డేటా ఎక్స్ ఛేంజ్' పరిశోధనలకు గొప్ప ఊతమిస్తోందన్నారు. 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్', ను త్వరలో ప్రారంభించనున్నట్లు, 'ఏఐ యూనివర్సిటీ'లు గేమ్ ఛేంజర్‌గా మారి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంటాయన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో 'ఇంటెలిజెన్స్' కంటే 'కో-ఆర్డినేషన్' అత్యంత ఖరీదైనదిగా మారిందన్నారు. ఏఐ వినియోగంలో డేటా ప్రైవసీ, ఎథిక్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆ దిశగా ఆర్ అండ్ డీపై ప్రత్యేక దృష్టి సారించాలని టెక్ కంపెనీలను కోరారు. భవిష్యత్తులో సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించగల 'క్రియేటివ్ థింకర్స్'కే ఉద్యోగ అవకాశాలుంటాయని అన్నారు. ఏఐ, ఇన్నోవేషన్, అకడమిక్ రీసెర్చ్ లాంటి అంశాల్లో బిట్స్ పిలానీతో కలిసి పని చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

-MSL

**SCR:**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో అదనపు రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పదో నెంబర్ ప్లాట్‌ఫాం వద్ద బేస్‌మెంట్ పార్కింగ్‌ను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. దీనితో పాటు బోయిగూడ వైపు ఉన్న యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థను తాత్కాలికంగా తొలగించారు. రద్దీని తట్టుకునేందుకు వీలుగా హైటెక్ సిటీలో 16 రైళ్లకు, చర్లపల్లిలో 11 రైళ్లకు, లింగంపల్లిలో 10 రైళ్లకు అదనపు స్టాపేజీలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఈ మార్పులు అమలులో ఉంటాయని రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు ఈ వెసులుబాటును గమనించి తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

- HYD PTC

**KVR:**

సంక్రాంతి పండుగ వేళ హైదరాబాద్ నుండి సొంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు మంత్రి

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారు. డీజీపీతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ సరిహద్దు వరకు వాహనాలకు భారీ భద్రత కల్పించినట్టు తెలిపారు. పంతంగి టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, ప్రయాణికుల కోసం టోల్ ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీ మరీ ఎక్కువగా ఉంటే టోల్ గేట్లను ఉచితంగా వదిలేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈ ఏడాది సుమారు 12 లక్షల వాహనాలు హైదరాబాద్ నగరాన్ని విడిచి వెళ్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్, నిలిచిపోయిన వాహనాలను తొలగించేందుకు క్రేన్లను అందుబాటులో ఉంచారు.

**బైట్ KVR...........**

- HYD PTC & MSL

**ప్రభుత్వ విప్:**

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్విరామ కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలో 23 లక్షల రూపాయిలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు ప్రభుత్వ విప్ ఈ రోజు శంకుస్థాపన చేశారు. శాత్రాజ్ పల్లిలో 1 కోటి 43 లక్షల రూపాయిలతో నిర్మిస్తోన్న 30 పడుకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... 15 లక్షల వ్యయంతో ప్రధాన కూడలిలో నూతన జంక్షన్ సుందరీకరణ పనులు జరుగుతున్నాయనీ, ఇప్పటికే మంజూరైన 45 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు.

**-------------బైట్- ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్----------**

- పి టి సి, రాజన్న సిరిసిల్ల

**CMRF చెక్కులు:**

బాన్సువాడ పట్టణ కేంద్రంలో... నియోజకవర్గానికి చెందిన 341 మంది లబ్ధిదారులకు కోటి 10 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులను రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి ఈ రోజు పంపిణీ చేశారు.

ఇందులో బాన్సువాడ గ్రామీణ మండలం నుంచి 41 మంది, బాన్సువాడ మున్సిపాలిటీ నుంచి 32 మంది లబ్ధిదారులు ఉండగా... బీర్కూర్ మండలం నుంచి 31, నస్రుల్లాబాద్ నుంచి 41, మొస్రా నుంచి 34, చందూర్ నుంచి 19, వర్ని నుంచి 43, రుద్రూర్ నుంచి 36, కోటగిరి నుంచి 23, పోతంగల్ మండలం నుంచి 35 మంది లబ్ధిదారులు ఉన్నారు.

PTC – కామారెడ్డి

**ఇండస్ట్రియల్ జోన్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణం లోని సర్వే నంబర్ 71, 73, 88 లోగల ఇండస్ట్రియల్ జోన్ ను ఎత్తి వేయాలని ఏ.ఐ.ఎఫ్.టి.యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం ప్రభుత్వాన్ని కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... ఇండస్ట్రియల్ జోన్ ను ఎత్తివేసి భూ యజమానులకు ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించాలని కోరారు. చంద్రంపేట చౌరస్తా నుంచి మొదటి బైపాస్ వరకు 80 ఫీట్ల రోడ్డుకు మరమ్మతులు చేయించాలన్నారు. ఇండస్ట్రియల్ జోన్ పరిధిలో దాదాపు 100 ఎకరాల భూమిలో యజమానులకు ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇస్తే మున్సిపాలిటీకి కూడా ఆదాయం పెరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆ దిశగా చర్యలు తీసుకోవాలని దశరథం కోరారు.

- పి టి సి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**యాక్సిడెంట్-మరణాలు:**

రోడ్డు ప్రమాదాల వల్ల చనిపోయే వారి సంఖ్య... క్యాన్సర్ వ్యాధి వల్ల చనిపోయేవారి కంటే ఎక్కువగా ఉందని జనగామ జిల్లా రోడ్డు రవాణా సంస్థ అధికారి జివిఎస్ గౌడ్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవంలో భాగంగా జిల్లాలోని పాలకుర్తిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రమాదాలలో 50% కంటే ఎక్కువ ప్రమాదాలు 35 ఏళ్ల లోపు ఉన్న యువత వల్లే జరుగుతున్నాయన్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రత్యేకంగా రహదారి భద్రతపై, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

- పిటిసి జనగామ

**నాటు సారా:**

నిర్మల్ జిల్లాలో నాటు సారాయి తయారి, అమ్మకాలను నిర్మూలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు నిర్మల్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ రంగస్వామి తెలిపారు. ఈరోజు జిల్లాలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించి,.. నాటు సారాయి తయారుచేస్తున్న పలువురుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో 23 లీటర్ల నాటు సారాయి, 800 లీటర్ల నల్లబెల్ల పానకం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

- పిటిసి నిర్మల్

**MLA కె. రాజేష్ రెడ్డి:**

పట్టణ అభివృద్ధిలో మౌలిక వసతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు రాజేష్ రెడ్డి ఈ రోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

- PTC నాగర్‌కర్నూల్ జిల్లా

**పోలీసుల కార్యక్రమం:**

సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి సోంతూళ్ళకు వెళుతోన్న ప్రయాణికులకు సూర్యాపేట జిల్లా పోలీసులు వినూత్నంగా వీడ్కోలు పలికారు. హైదరాబాద్ నుండి ఆంధ్రప్రదేశ్ కు వెళ్తున్న వాహనదారులకు సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో పోలీసులు పువ్వులు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. "ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా వెళ్ళండి, సంతోషంగా పండగ జరుపుకొని తిరిగి క్షేమంగా హైదరాబాద్కు రండి" అని చెప్తూ ఆంధ్రా ప్రజలకు, ప్రయాణికులకు వీడ్కోలు పలికారు.

**--------------బైట్...... నరసింహ, ఎస్పీ--------------**

-పీటీసీ నల్లగొండ

**కడియం కావ్య & కడియం శ్రీహరి:**

విద్యే సమాజాన్ని మార్చే శక్తి అని, ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భావనను తీసుకువచ్చారని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గం జఫర్గడ్ మండలంలో నిర్మించబోతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి వరంగల్ జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, తెలంగాణ ఈడబ్ల్యుఐడీసీ ఎండీ గణపతి రెడ్డి, శాసనసభ్యులు కడియం శ్రీహరితో కలిసి భూమి పూజ చేశారు.

- పిటిసి జనగామ

**వాతావరణం :**

రాష్ట్రంలో వరుసగా నాలుగో రోజు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. హైదరాబాద్ లో రాజేంద్ర నగర్, శేరిలింగంపల్లి, మౌలాలి పరిసరాలలో 10 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లో 13 డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు వాతావరణ విభాగం తెలియజేసింది.

-PN

**భక్తి ప్రదర్శనలు:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పుణ్యక్షేత్రంలోని భీమేశ్వర సదన్ సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కళాకారుల నృత్యాలు, హరికథలు, భక్తిసంగీతం, పౌరాణిక నాటకప్రదర్శన తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పి రవిప్రసాద్ హరికథ, టి.వి. మోహనకుమార్ సంగీతకచేరి అలరించింది. శశిధర్ శర్మ భక్తి సంగీతం, డాక్టర్ శూల పాణి భక్త పోతన నాటక ప్రదర్శన, రఘు బృందం భక్తిసంగీతం, భాగవత హరిణి నాగరాణిచే హరికథ భక్తులను ఆకట్టుకున్నాయి.

- పిటిసి, రాజన్న సిరిసిల్ల

**వాతావరణం :**

రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతోంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 10 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. హైదరాబాద్ లో కూడా రాజేంద్ర నగర్, శేరిలింగంపల్లి, మౌలాలి పరిసరాలలో 10 డిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా జిల్లాల్లో 13 డిగ్రీల లోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్టు వాతావరణ విభాగం తెలియజేసింది.

...పీఎన్